రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మహావీర్‌ ఇంటర్నేషనల్‌ తలసీమియా, సికిల్‌ సెల్‌ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. కళాశాల సెక్రటరీ టీవీరెడ్డి, డైరెక్టర్లు సరోజరెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.శ్రీలత, పీఆర్వో రవిసుధాకర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ పీవో రాజేష్‌, విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజకీయాలొద్దు !



మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌ అభివృద్ధిలో రాజకీయాలు వద్దని కార్పొరేటర్‌ శ్రవణ్‌ అన్నారు. డివిజన్‌ పరిధిలోని సర్దార్‌పటేల్‌నగర్‌ ప్రాంతంలో ఇంజినీరింగ్‌ విభాగం అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో నిధుల కొరత ఉన్నప్పటికీ ముంపు సమస్య పరిష్కారానికి సుమారు రూ. 59 లక్షలతో నాలా నిర్మాణ పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు కార్పొరేటర్లుగా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు పనిచేసినా నాలా నిర్మాణం జరగలేదన్నారు. ప్రస్తుతం పనులు జరుగుతుంటే స్వార్థ రాజకీయాల కోసం అడ్డుకోవడం తగదన్నారు. 'నాలా నిర్మాణం జరిగితే బతుకమ్మ ఆడతారా.. అని ఎగతాళి చేస్తున్నారని' ఇది మహిళలను కించపరిచినట్లేనన్నారు. ఈఈ లక్ష్మణ్‌, డీఈ మహేష్‌, ఏఈ నవీన్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌ తదితరులు పాల్గొన్నారు

యాంటీ బయాటిక్స్‌ వాడకాన్ని తగ్గించాలి

మల్లాపూర్‌: డాక్టర్‌ పర్యవేక్షణ లేకుండా యాంటీ బయాటిక్స్‌ వాడటం మంచిది కాదని మన్నా బయోటెక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ చతుర్వేది అన్నారు. శుక్రవారం నేషనల్‌ సైన్స్‌ డే సందర్భంగా యాంటీ మైక్రోబియల్‌ రెసిస్టన్స్‌ నాచారంలో మన్నా బయాటిక్‌ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోషక, సమతుల్యం ఆహారాన్ని తీసుకోవడంతో సహజమైన రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోని ఆహారాన్ని ఔషధంగా మలచుకోవాలని సూచించారు. ర్యాలీలో సంస్థ ఫైనాన్స్‌ డైరెక్టర్‌ రూపకుమార్‌, అకడమిక్‌ డైరెక్టర్‌ మునికుమార్‌, మానస వినీల ప్రోగామ్‌ మేనేజర్‌ భరత్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి

మల్లాపూర్‌: నాచారం డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని శుక్రవారం ఈస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌కు నాచారం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌ వినతిపత్రం అందజేశారు. నాచారం వార్డు కార్యాలయాలనికి లిఫ్ట్‌ సౌకర్యం లేకపోవడంతో ప్రారంభించలేదని తక్షణమే లిఫ్ట్‌ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కమిషనర్‌ను కోరారు. డివిజన్‌లో 4 ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఘనంగా టైలర్స్‌ డే

అల్వాల్‌: లోతుకుంటలోని మేరు సంఘం కార్యాలయంలో శుక్రవారం టైలర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్‌ కనిపెట్టిన విలియమ్స్‌ హోవే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్‌ టైలర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అధ్యక్షులు రాపర్తి చంద్రశేఖర్‌, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌, కోశాధికారి బత్తుల కరణ్‌, ఉపాధ్యక్షులు మాడిశెట్టి బాలయ్య, సత్యనారాయణ, రామగిరి గోపాల్‌, కార్యదర్శులు కీర్తి గణేష్‌, రాపర్తి కరుణాకర్‌, కీర్తి సుధాకర్‌, బాలనర్సయ్య, ప్రభాకర్‌, శంకర్‌, శేఖర్‌, శ్రీనివాస్‌, సాయితేజ, శ్రీనాథ్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

అల్వాల్‌: జీతాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అల్వాల్‌ సర్కిల్‌ ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులు శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ వ్యవస్థ ఎత్తివేసి కార్పొరేషన్‌ ద్వారా జీతాల చెల్లింపు, హెల్త్‌కార్డులు, జీతాలపెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అల్వాల్‌ సర్కిల్‌ ఔట్‌సోర్సింగ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌, ప్రధాన కార్యదర్శి బీవి.శ్రీనివాస్‌, ఉపాధ్యక్షులు పురుషోత్తం, విష్ణువర్ధన్‌రెడ్డి, సతీష్‌, జానీ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత మెరుగుకు 'సైన్స్‌ ఫెయిర్‌'

ఆకట్టుకున్న విద్యార్థుల ఎగ్జిబిట్స్‌ ప్రదర్శన



నాగారం ప్రభుత్వ పాఠశాల ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్‌ నాగిరెడ్డి

కీసర: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీసేందుకు సైన్స్‌ ఫెయిర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని నాగారం మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. జాతీయ సైన్స్‌ డే సందర్భంగా నాగారం మున్సిపల్‌లోని ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహించిన సైన్స్‌ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషి జీవితంలో సైన్స్‌ చాలా ముఖ్యపాత్ర పోషిస్తుందని ,సైన్స్‌తోనే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. రకరకాల వస్తువులు, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని జీవనశైలిని సులభతరం చేసుకోగల్గుతున్నామన్నారు. విజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల భూమిపై నుంచి ఇతర గ్రహాలకు రాకెట్లలో వెళ్లగల్గుతున్నామన్నారు. విద్యార్థులు తమ చదువులను ఇష్టంతో చదువుకుంటూ ముందుకెళ్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఉత్తమ ఎగ్జిబిట్స్‌ ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. కీసరలోని అరుందతీ పాఠశాలలో సైన్స్‌ డేను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ మల్లేష్‌యాదవ్‌, మాజీ కౌన్సిలర్‌ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌, ప్రధానోపాధ్యాయురాలు పీసీ రాములు, వనజ, అరవింద్‌, రమా, కమల, విమల, రాజ్యలక్ష్మి, సుమతినాయక్‌, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోచారం: యంనంపేట్‌లోని రాక్‌ఉడ్స్‌ ఇంటర్నేషనల్‌ పాఠశాలలో ఘనంగా విజ్ఞాన దినోత్సవం జరిగింది. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త డా. ఫణీంద్ర పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆసక్తిని పెంచుకుని రాణించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో విద్యార్థులు శాస్త్రీయ ప్రదర్శనలు, విజ్ఞాన చరిత్రపై నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాక్‌వుడ్స్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ సీఈఓ, ప్రిన్సిపాల్‌ తదితరులున్నారు.

పాపారాయ విద్యానికేతన్‌లో..

మేడ్చల్‌: పట్టణంలోని పాపారాయ విద్యానికేతన్‌ పాఠశాలలో జాతీయ సైన్స్‌ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్‌ మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను తిలకించి, ప్రాజెక్టులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రస్తుత సమాజంలో ఆలోచన విధానాన్ని కలిగి ఉండాలని, మన చుట్టూ ఉన్న ప్రతీ పరికరాన్ని ఎవరో ఒకరు కొన్నేళ్లు కష్టపడి తయారు చేసినవేనన్నారు. మానవ జీవితం సైన్స్‌తో ముడిపడి ఉందని, విద్యార్థులుగా భవిష్యత్తులో తక్కువ ఖర్చులో సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను తయారు చేయాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్లు రామేశ్వర్‌రెడ్డి, నర్సింహులుగౌడ్‌, రాజేందర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్‌ అనిత, ప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్ల సందర్శన



మురహరిపల్లిలో డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్లను సందర్శించిన ఎంపీ ఈటల

శామీర్‌పేట్‌: మేడ్చల్‌ జిల్లా, శామీర్‌పేట మండలం , మురహరిపల్లిలోని డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్ల అపార్ట్‌మెంట్‌లను శుక్రవారం ఎంపీ ఈటల రాజేందర్‌ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అర్హులకు కేటాయించిన డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్లలో కనీస సౌకర్యాలు లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తన దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండంతో గత ప్రభుత్వ పాలకులు అరకొర వసతులతో డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్లను కేటాయించి ప్రజలను మోసం చేశారని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్లకు నీరు, విద్యుత్‌ను సరఫరా చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఫోన్‌ద్వారా ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు.

ఘనంగా మల్లన్న బోనాలు



స్వామివారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



ఎంపీ ఈటల రాజేందర్‌తో స్థానిక బీజేపీ నేతలు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి కల్యాణం కనులపండువగా సాగింది. కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆలయాన్ని పూలు, విద్యుత్‌కాంతులతో ముస్తాబు చేశారు. కల్యాణం అనంతరం అగ్నిగుండాలు, పట్నం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు స్వామివారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో మల్కాజగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌, అసెంబ్లీ కన్వీనర్‌ మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్‌, సరస్వతి, బాలరాజ్‌, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్‌యాదవ్‌, మున్సిపల్‌ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌, నాయకులు కృష్ణగౌడ్‌, వెంకటేష్‌, నాగరాజు,నర్సింగ్‌యాదవ్‌, రాము, నవీన్‌, యాదవ సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించినప్పుడే గుర్తింపు



ఎంఈఓ వసంతకుమారిని సన్మానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌ తదితరులు

శామీర్‌పేట్‌: ప్రజలకు ఉత్తమ సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. ఉమ్మడి శామీర్‌పేట మండల విద్యాధికారి వసంతకుమారి ఉద్యోగ విరమణసభ తూంకుంట మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ ఈటలతో పాటు ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా అందాల్సిన ప్రయోజనాలు పూర్తిగా అందకున్నా.. ఉపాధ్యాయులు కష్టపడి పని చేస్తూ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా, ఎంఈఓగా వసంతకుమారి ఉన్నతంగా సేవలు అందించి, ఇటు అధికారులు, అటు ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. డీఈవో విజయకుమారి, వివిధ మండలాల ఎంఈఓలు రంగాచారి, భాగ్యమణి, శశిధర్‌, బాపురెడ్డి, సురేష్‌ , పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్‌ పరీక్షలు

- పరీక్షల నిర్వహణకు 150 పరీక్షా కేంద్రాలు
- వసతుల కల్పనకు పకడ్బందీ చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: ఇంటర్మీడియట్‌ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 5 నుంచి 25 వరకు జరిగే ఇంటర్మీడియట్‌ పరీక్షలకు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 150 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయటంతో పాటు అన్నీ వసతులను కల్పించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇంటర్‌ మొదటి సంవత్సరానికి సంబంధించి 64,107 విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా.. ద్వితీయ సంవత్సరానికి 62,316 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్‌ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల పర్యవేక్షణకు ఫ్లైయింగ్‌ స్కాడ్స్‌తో సహా 5 సిట్టింగ్‌ స్కాడ్స్‌ను నియమించారు. పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణకు ప్రత్యేక టీమ్‌లను కూడా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇన్విజిలేటర్లను నియమించామని స్పష్టం చేశారు.

స్వచ్ఛతలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలి



స్వచ్ఛ సర్వేక్షణ్‌పై మాట్లాడుతున్న మున్సిపల్‌ కమిషనర్‌ భాస్కర్‌రెడ్డి

కీసర: ప్రతి ఒక్కరూ స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగస్వామ్యమై చెత్త, ప్లాస్టిక్‌ రహితంగా నాగారంను తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని నాగారం మున్సిపల్‌ కమిషనర్‌ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తే కుటుంబంలో అందరికీ స్వచ్ఛత గురించి తెలుస్తుందన్నారు. హెచ్‌.ఎం.జమదగ్ని, డీఆర్‌సీసీ కన్సల్టెంట్‌ విజయలక్ష్మి, విపుల్‌, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల పొదుపుతోనే కుటుంబ శ్రేయస్సు



మాట్లాడుతున్న లీడ్‌ డిస్ట్రిక్ట్‌ మేనేజర్‌ శివప్రసాద్‌

కీసర: మహిళల పొదుపుతోనే కుటుంబ శ్రేయస్సుతోపాటు దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని మేడ్చల్‌, మల్కాజ్‌గిరి జిల్లా లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ శివప్రసాద్‌, ఎస్‌.ఎస్‌.టీ.సీ.ఎఫ్‌.ఎల్‌. జిల్లా కో–ఆర్డినేటర్‌ శ్రీనివాసరావులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్‌బీఐ, కెనరా బ్యాంకు వారి సౌజన్యంతో సొసైటీ ఫర్‌ సోషల్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌ (ఎస్‌ఎస్‌టీ) సంస్థ ఆధ్వర్యంలో మహాత్మజ్యోతిరావుపూలే బీసీ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ.. పొదుపు చేసే మహిళలు ఘనతను సాధిస్తారని, మహిళలు చిన్న మొత్తాలను పొదుపుగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. చిన్న మొత్తాల పొదుపు భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆర్థిక క్రమశిక్షణతో క్రెడిట్‌ స్కోర్‌ పెంచుకోవాలని, రుణాలను బ్యాంకుల్లోనే తక్కువ వడ్డీకే పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రధానమంత్రి సురక్షబీమా, జీవన్‌జ్యోతి, సుకన్యసమృద్ధి యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశ ఆర్థిక అభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తారన్నారు. సైబర్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మహిళల ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వనజాత, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ వెంకటస్వామి, కీసర ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మండల కో– ఆర్డినేటర్‌ విశ్వనాథ్‌, కౌన్సిలర్‌ ఉమామహేశ్వరి, లెక్చరర్లు గంగావతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటర్‌పై చర్యలు తీసుకోవాలి



జిల్లా పౌరసరఫరాల అధికారికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్‌ నేతలు

సాక్షి,సిటీబ్యూరో: తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోతాయిపల్లిలో జరిగిన గ్యాస్‌ సిలిండర్‌ పేలుడు ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా పౌరసరఫరాల అధికారి సుగుణబాయికి తెలంగాణ కుకింగ్‌ గ్యాస్‌ డెలివరీ వర్కర్స్‌ ట్రేడ్‌ యూనియన్‌ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆమెకు యూనియన్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ సలహాదారులు చామకూర రాజు, కేవీగౌడ్‌, యూనియన్‌ ఉపాధ్యక్షుడు ఎండీ యునుస్‌, హర్షిత్‌, కుమార్‌, వేణు, రమేష్‌, రాజు వినతిపత్రం అందజేశారు. డిస్ట్రిబ్యూటరే స్వయంగా అక్రమ రీఫిలింగులు చేస్తూ.. అక్రమాలకు పాల్పడుతున్నారని జిల్లా సివిల్‌ సప్లై అధికారికి యూనియన్‌ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డితో పాటు ఉన్నతాధికారులకు కూడా వినతిపత్రం అందజేసినట్లు సమాచారం.

పార్కుల అభివృద్ధికి కృషి

మల్కాజిగిరి: డివిజన్‌ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేస్తామని ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ అన్నారు. సీఫెల్‌ కాలనీలో సుమారు రూ.11 లక్షలతో జరుగుతున్న పార్కు ప్రహరీ నిర్మాణం, సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజలు సేదతీరేందుకు ఇప్పటికే ఉన్న పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



బస్తీ దవాఖానాను సందర్శించిన ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్‌ ప్రభుదాస్‌

కుషాయిగూడ: బస్తీ దవాఖానాల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలోని బస్తీ దవాఖానాను శుక్రవారం కార్పొరేటర్‌ ప్రభుదాస్‌తో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న మందులను ఆయన పరిశీలించారు. నిత్యం రోగుల తాకిడిపై ఆరా తీశారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నది బస్తీ దవాఖానాల ప్రధాన ఉద్దేశమన్నారు. ఆ దిశగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. మాజీ కార్పొరేటర్‌ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, డాక్టర్‌ పల్లవి, ఆశావర్కర్‌ తార తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో అన్నపూజ మహోత్సవం





స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం





స్వామివారికి అన్నాభిషేకం

కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవరోజు కీసరగుట్ట స్వామి సన్నిధిలో వేదపండితులు విశేషపూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం గర్భాలయంలో మహన్యాసపూర్వకరుద్రాభిషేకం అనంతరం లోకంలోని ప్రజల ఆకలిబాధను (క్షుద్బాద) తీర్చాలని ఆ పరమశివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. అమావాస్యరోజు కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు గుట్టకు దేవాలయానికి తరలివచ్చారు. సామూహిక అభిషేకంలో భక్తులు పాల్గొన్నారు. స్వామిదర్శనానంతరం ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని శివలింగాలకు పాలు, పసుపు, కుంకుమ, నూనె, నెయ్యిలతో అభిషేకం నిర్వహించారు. రాత్రి 7గంటల సమయంలో ప్రదోషకాలపూజ, హారతి, మంత్రపుష్పం, తదితర పూజలను నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామివారికి వసంతోత్సవం, పుష్పయాగం చేశారు. ఆలయ చైర్మన్‌ తటాకం నారాయణ, ఈవో సుధాకర్‌రెడ్డి, ఫౌండర్‌ ట్రస్టీ సభ్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్సవం సమాప్తి..

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు నేటితో ముగియనున్నాయని ఆలయ చైర్మన్‌ తటాకం నారాయణ తెలిపారు. శనివారం దేవాలయంలో ఉదయం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం క్షేత్ర దిగ్బలి, పూర్ణాహుతి, పండితసన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

బ్రహ్మోత్సవాల ఐదవరోజు విశేషాలు..

కీసర: కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కీసరగుట్టస్వామిని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ కల్వ సుజాత దర్శించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రాన్ని ఆమె సందర్శించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే రమేష్‌గుప్తా, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాయిల శ్రావన్‌గుప్తా, కోశాధికారి నాగేష్‌గుప్తా, సభ్యులు రాజుగుప్తా, సాయినాథ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

- దమ్మాయిగూడ మున్సిపల్‌ కమిషనర్‌ నాగమణి ఆద్వర్యంలో గత 5 రోజులుగా మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టారు. డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, పర్యవేక్షణలో సుమారు 1000 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులతో 24 గంటలపాటు, 3 షిఫ్టులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.
- ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌లో యువజన క్రీడలను ఆలయ చైర్మన్‌ తటాకం నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీసరగుట్ట బ్రహోత్సవాల సందర్భంగా విద్యార్థులు, యువతకు క్రీడాపోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకుంటూ క్రీడాపోటీల్లో ముందుకెళ్లాలన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్‌ నారాయణ



వాలీబాల్‌ ఆడుతున్న క్రీడాకారులు

ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రామంతాపూర్‌ : కామాక్షిపురంలోని సంజీవ ఆంజనేయ కాశీ విశ్వనాథ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన జరిగింది. శుక్రవారం గణపతిపూజ, అంకురార్పణ, అఖండ దీప స్థాపన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు నాగరాజు, అంజయ్య పటేల్‌, అశోక్‌రాజ్‌ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



తిరుపతిరావు

జవహర్‌నగర్‌: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ అంబేడ్కర్‌నగర్‌కి చెందిన తస్నీరు తిరుపతిరావు (32) మేస్త్రీ పనిచేస్తుంటాడు. కాగా మద్యానికి బానిసైన అతడు శుక్రవారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లిన అతడు భార్య అనితకు వీడియో కాల్‌ చేసి మద్యం తాగి చనిపోతానని చెప్పి బెదిరించాడని, అతడు ఉన్న చోటు చెప్పలేదని భార్య పోలీసులకు తెలిపింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.